సాక్షి
మహబూబాబాద్
సోమవారం । 2 । సెప్టెంబర్ । 2024

దోర్నకల్: ముల్కలపల్లిలో ఆకేరు వరదలో మునిగిన ఇళ్లు



నాలాలు పొంగిపొర్లడంతో జలమయమైన మహబూబాబాద్ పట్టణంలోని బయ్యారం, ఇల్లెందు రోడ్డు



ప్రజల దిగ్బంధం

జిల్లాలో భారీ వర్షం

- పలు మండలాలకు రాకపోకలు బంద్
- తెగిన చెరువు కట్టలు, నీటమునిగిన పంటలు
- తెగిన రైల్వే ట్రాక్–తప్పిన ప్రమాదం
- రైళ్ల రాకపోకలు బంద్
- అధికారులు అప్రమత్తంగా ఉండాలి: సమీక్షలో మంత్రి సీతక్క
- జిల్లాలో కంట్రోల్ రూం ఏర్పాటు

మహబూబాబాద్/మహబూబాబాద్ అర్బన్/మహబూబాబాద్ రూరల్: రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జనజీవనం స్తంభించింది. ఆదివారం కురిసిన భారీ వర్షానికి మున్నేరువాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో 16 వార్డు ఎట్టిగడ్డ సమీపంలో ఉన్న పంట పొలాలు మునిగిపోయాయి. జాతీయ రహదారి 365పై జల ప్రవాహంతో స్తంభించడంతో వరంగల్, నర్సంపేట, గూడూరుకు రాకపోకలు నిలిచిపోయాయి. పట్టణంలోని పలు కాలనీలతోపాటు మండలాలకు, గ్రామాలకు, తండాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మున్నేరు వాగు ప్రాంతంలో ఉన్న రా వాటర్ ట్యాంక్ వరదతో నిండిపోయింది. ఫిల్టర్‌బెడ్‌లో గదుల్లో నీరు చేరి మోటర్లు మునిగిపోయాయి. కేసముద్రం – ఇంటికన్నె రైల్వేస్టేషన్‌ల వరద ఉధృతికి గండిపడి, కొంతదూరం వరకు మట్టి, కంకర కొట్టుకుపోయింది. భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూం నంబర్ 7995074803 ఏర్పాటు చేశారు.

నీట మునిగిన పంటలు

భారీ వర్షం కారణంగా జిల్లాలోని పలు మండలాల్లో పంటలు నీటమునగటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మహబూబాబాద్ మండలంలోని అయోధ్య గ్రామ చెరువు కట్ట తెగిపోయి వరద నీరు పొంగిపొర్లుతూ ఈదులపూసపల్లి చెరువుకు పరుగులు పెట్టింది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి మండలంలోని వీఎస్.లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఐలబోయిన కమలాకర్ కోళ్ల ఫారం (రూ.10 లక్షల విలువగల) కూలిపోయింది.



మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో రైల్వే ట్రాక్ వైపు పూర్తిగా ముంచెత్తిన బంధం చెరువు

జిల్లాలో పూర్తిగా నిండిన చెరువులు 1,546

జిల్లాలో 1,590 చెరువులు ఉండగా కురుస్తున్న వర్షాలతో 1,546 చెరువులు నిండగా 52 చెరువులు కట్టలు తెగిపోయాయని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. తెగిన చెరువు కట్టలకు తాత్కాలిక మరమ్మతు పనులు చేపట్టడం జరిగిందన్నారు. అలాగే వందశాతం దగ్గరలో ఉన్న చెరువులు 8, 75 శాతం నిండినవి ఒకటి, 50 శాతం నిండిన చెరువులు 18 ఉండగా 25 శాతం నిండిన చెరువులు 7 ఉన్నాయని తెలిపారు.

ఇళ్లను వదిలి బయటకు రావొద్దు..

మహబూబాబాద్ రూరల్: జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల దృష్ట్యా ప్రజలు ఇళ్లను వదిలి బయటకు రావొద్దని, ఏదైన విపత్కర సమస్య వస్తే డయల్ 100, లేదా దగ్గరలోని పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ సూచించారు. జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలకు, పోలీస్‌సిబ్బందికి పలు సూచనలు చేశారు. జిల్లాలో ఎక్కడైనా వరద ఉధృతితో రోడ్లు తెగిపోయినా, ఉధృతంగా నీరు ప్రవహిస్తే రాళ్లు, పెద్ద వాహనాలు అడ్డంపెట్టి సంబంధిత గ్రామాల పెద్ద మనుషులకు, సర్పంచులకు, ప్రజలకు తెలియజేయాలని సూచించారు. 24 గంటలు ప్రజలకు ఆయా మండల పరిధిలోని పోలీస్ సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు.

జిల్లాలో 296.7 మిల్లీమీటర్ల వర్షపాతం

జిల్లాలో సరాసరి 296.7 మిల్లీమీటర్ల వర్షపాతనం నమోదు అయినట్లు సీపీఓ అధికారులు తెలిపారు. మండలాల వారీగా పరిశీలిస్తే కొత్తగూడ మండలంలో 162.4 ఎంఎం, గంగారంలో 68.2, బయ్యారంలో 180.0, గార్లలో 174.4, దోర్నకల్‌లో 262.4, కురవిలో 354.2, మానుకోటలో 374.8, గూడూరులో 254.0, కేసముద్రంలో 377.2, నెల్లికుదురులో 469.6, నర్సింహులపేటలో 405.6 చిన్నగూడూరులో 450.6, మరిపెడలో 352.4, దంతాలపల్లిలో 354.2, తొర్రూర్‌లో 262.4, పెద్దవంగరలో 245.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయినట్లు అధికారులు పేర్కొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

- వీసీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

మహబూబాబాద్: భారీ వర్షాల నేపథ్యంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సూచించారు. ఆదివారం హైదరాబాద్ నుంచి డీజీపీ డాక్టర్ జితేందర్, ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వర్షాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఎక్కడ ప్రాణనష్టం జరగకుండా చూడాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా చూడాలన్నారు. వీసీలో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, అడిషనల్ ఎస్పీ చెన్నయ్య, అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బంది కలగొద్దు: కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



వరద ప్రాంతాలను పరిశీలిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మరో రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రం శివారులోని మున్నేరువాగు, బంధం కుంటతో పాటు రావిరాల, నెల్లికుదురు రోడ్డు, తాళ్లపూసపల్లి రోడ్డు, ఎన్టీఆర్ స్టేడియం తదితర ప్రాంతాల్లో కలెక్టర్ వరద ఉధృతిని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పలు రోడ్లలో రాకపోకలు నిషేధించడం జరిగిందని, ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దన్నారు. ఇప్పటికీ ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేసి జిల్లా వ్యాప్తంగా సమస్యల పరిష్కారానికి వచ్చిన ఫిర్యాదులు వెంటనే ప్రత్యేక బృందాల చేత పరిష్కరించడం జరిగిందన్నారు. వర్షాల కారణంగా ప్రజల సౌకర్యార్థం దోర్నకల్, మరిపెడ, నెల్లికుదురు, కురవిలో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్, అధికారులు ఉన్నారు.

జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

- సమీక్షలో మంత్రి సీతక్క



మాట్లాడుతున్న మంత్రి సీతక్క

సాక్షి, మహబూబాబాద్: జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) ఆదివారం రాత్రి కలెక్టరేట్ సమావేశం మందిరంలో కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, అదనపు కలెక్టర్లు, సంబంధిత అధికారులతో కలిసి భారీ వర్షాలపై తీసుకుంటున్న చర్యల గురించి సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రజలకు, రైతులకు భారీ వర్షాల కారణంగా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చెరువులు, కుంటలు, వాగులు, ప్రమాద స్థాయిలో ఉండడంతో ప్రజలు అటు వైపు వెళ్లకుండా పోలీస్ సిబ్బంది చూడాలని ఆదేశించారు. పురుషోత్తమాయ గూడెం ప్రమాద సంఘటన, నెల్లికుదురు మండలం రావిలాల సంఘటనలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సమీక్ష సమావేశంలో ఆర్డీఓ అలివేలు, ఇరిగేషన్ ఈఈ సమ్మిరెడ్డి, ఆర్ అండ్ బీ ఈఈ భీమ్లా నాయక్, జిల్లా పంచాయతీ అధికారి హరిప్రసాద్, మున్సిపల్ కమిషనర్ రవీందర్, కలెక్టరేట్ పరిపాలనాధికారి పవన్ కుమార్ పాల్గొన్నారు. అలాగే భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీ పోరిక బలరాంనాయక్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలను కోరారు.

స్తంభం ఎక్కి.. విద్యుత్ సరిచేసి..



జేసీబీ సాయంతో స్తంభాన్ని సరిచేస్తున్న సిబ్బంది

నెహ్రూసెంటర్: భారీ వర్షాల కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పునరుద్ధరణ పనులను విద్యుత్ శాఖ అధికారులు వెంటనే చేపట్టారు. జిల్లా కేంద్రంలోని బంధం చెరువు ఉధృతంగా ప్రవహించడంతో విద్యుత్ స్తంభం కుంగిపోయి సరఫరా నిలిచిపోయింది. దీంతో విద్యుత్‌శాఖ అధికారి నరేష్ ఆధ్వర్యంలో మరమ్మతు పనులను చేపట్టి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.



గార్ల: రైల్వే బ్రిడ్జి కింద నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న పాకాల ఏరు



ఈదులపూసపల్లి రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరు



మరిపెడ రూరల్: ఆకేరు వాగులో చిక్కుకున్న వృద్ధురాలిని సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్న రెస్క్యూటీం



చిన్నగూడూరు:ఆకేరు వాగులో నీట మునిగిన ఆలయాలు



మరిపెడ రూరల్: వరద ఉధృతిని పరిశీలిస్తున్న విప్, ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచంద్రునాయక్



మహబూబాబాద్ అర్బన్: నర్సంపేట వరంగల్ జాతీయ రహదారిపై వరద

దెబ్బతిన్న రైల్వే ట్రాక్..నిలిచిన రైళ్లు
- ప్రయాణికుల ఇబ్బందులు

తాడ్వాయిలో టోర్నడోలు..
- భారీ ఈదురుగాలులకు వేల సంఖ్యలో నేలకూలిన చెట్లు
- పరిశీలించిన మంత్రి సీతక్క

రైల్వే రవాణా అతలాకుతలం..
- వర్షాలతో పలు రైళ్లు రద్దు, దారి మళ్లింపు

మృత్యు ప్రవాహం
- వరద నీటి ప్రవాహంలో కొట్టుకుపోయి ముగ్గురు మృతి

- వివరాలు 8లో, మరిన్ని ఫొటోలు 8,9లో ▸

పిడుగు పాటును చూశారా!



కెమెరాలో బంధించిన పిడుగుపాటు దృశ్యం

గూడూరు: పిడుగుపాటు వినడమే తప్ప చూసిన వారు చాలా అరుదుగా ఉంటారు. అలాంటి అరుదైన చిత్రాన్ని ఓ ఫొటో గ్రాఫర్ తన కెమెరాలో బంధించాడు. వివరాలిలా ఉన్నాయి. గూడూరు మండల కేంద్రానికి చెందిన గోపగాని సురేశ్‌గౌడ్ అనే ఫొటోగ్రాఫర్ తన కెమెరాలో పిడుగు పడే దృశ్యాన్ని బంధించాలనుకున్నాడు. శనివారం భారీ వర్షం కురుస్తుండగా కెమెరా పట్టుకుని తను ఉండే భవనం బాల్కానిలో ఉండి పిడుగుపడే సమయంలో ఆ దృశ్యాన్ని తన కెమెరాలో బంధించాడు. ఆ దృశ్యాన్ని చూసిన పలువురు సురేశ్‌గౌడ్‌ను అభినందించారు.

సత్వర న్యాయం అందించేందుకు కృషి

- హైకోర్టు జడ్జి, జస్టిస్ నంద

మహబూబాబాద్ రూరల్/కురవి: కక్షిదారులకు సత్వర న్యాయం అందించేందుకు న్యాయ వ్యవస్థ కృషి చేస్తుందని హైకోర్టు జడ్జి, జిల్లా కోర్టు పరిపాలన జడ్జి, జస్టిస్ సూరెపల్లి నంద అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన పలు ప్రత్యేక కార్యక్రమాలకు జడ్జి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మొదటగా పోలీసుల నుంచి జస్టిస్ నంద గౌరవ వందనం స్వీకరించి, అనంతరం మొక్క నాటారు. మహిళల బార్ అసోసియేషన్ గదిని ప్రారంభించి, శ్రీ సత్య లయన్స్ కంటి ఆస్పత్రి, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి పరీక్షల, రక్తదాన, వైద్య శిబిరాలను ప్రారంభించారు. అదే విధంగా న్యాయవాది తోర్నాల పుల్లయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారుడు తోర్నాల నగేష్ కుమార్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కంప్యూటర్ లైబ్రరీని ప్రారంభించి అందుబాటులోకి తీసుకువచ్చారు. అనంతరం జడ్జి నంద మాట్లాడారు. బెంచ్, బార్ సమన్వయంతో వ్యవహరించి కేసుల పరిష్కారానికి చొరవ చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి డి.రవీంద్రశర్మ, సీనియర్ సివిల్ జడ్జి సురేష్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి తిరుపతి, వెంకటేశ్వర్లు, క్రాంతికుమార్, తదితరులు పాల్గొన్నారు. అలాగే కురవి మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న హైకోర్టు జడ్జి నంద

నేడు విద్యాసంస్థలకు సెలవు

మహబూబాబాద్: భారీ వర్షాల నేపథ్యంలో నేడు (సోమవారం) జిల్లాలోని అన్ని విద్యాసంస్థలకు సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

నేటి ప్రజావాణి రద్దు..

భారీ వర్షాల నేపథ్యంలో నేడు (సోమవారం) నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు చేసినట్లు కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో చెరువులు, కుంటలు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నందున ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలుగవద్దనే ఉద్దేశ్యంతో ప్రజావాణి రద్దు చేశామన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి దరఖాస్తులు ఇచ్చేందుకు కలెక్టరేట్‌కు రావొద్దన్నారు.

రాళ్లవాగులో డీసీఎం గల్లంతు

- వాహనంలో ఐదుగురు వ్యక్తులు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదులపూసపల్లి గ్రామంలో గల పెద్ద చెరువు వరద ఉధృతి పెరిగి ప్రవహిస్తుండగా ఆదివారం రాత్రి కేసముద్రం నుంచి మహబూబాబాద్ వైపునకు వస్తున్న డీసీఎం అదుపుతప్పి కొట్టుకుపోయింది. ఆ వాహనం వరద నీటి ప్రవాహంలో కొంత దూరం వరకు వెళ్లి ఆగిపోగా అందులో ఉన్న రాజమండ్రికి చెందిన సునీల్ కుమార్, సంగారెడ్డికి చెందిన ప్రవీణ్ కుమార్, మహబూబాబాద్‌కు చెందిన దుర్గాప్రసాద్, గుంటూరుకు చెందిన వేణుకోటయ్య, నాగభూషణంలు అరుపులు, కేకలు వేయటంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. డీఎస్పీ తిరుపతిరావు, టౌన్ సీఐ దేవేందర్, రూరల్ ఎస్సై దీపిక సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని గమనించి వెంటనే జేసీబీ తెప్పించారు. దానికి వైర్లు, రబ్బర్ ట్యూబులు కట్టి నీటిలోకి వదలగా నీటి ప్రవాహంలో ఉన్న నాగభూషణం అనే వ్యక్తి వాటి సహాయంతో ఒడ్డుకు వచ్చే ప్రయత్నం చేశాడు. కొంత దూరం వరకు వచ్చి కాపాడే ప్రయత్నంలో దగ్గరకు వచ్చినట్లే వచ్చి నీటిలోకి జారిపోయాడు. మిగతా నలుగురు వ్యక్తులు సురక్షితంగా బయటకు వచ్చారు.



నీటి ప్రవాహంలో కొట్టుకుపోయిన డీసీఎం

కేయూ డిగ్రీ ఇన్‌స్టంట్‌ పరీక్షల ఫలితాలు విడుదల

● 62.83శాతం ఉత్తీర్ణత

కేయూ క్యాంపస్‌: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్‌, ఖమ్మం, ఆదిలాబాద్‌ జిల్లాల్లో డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీసీఏ , బీఒకేషనల్‌ కోర్సుల్లో ఆరో సెమిస్టర్‌ పరీక్షల్లో ఒక్క సబ్జెక్టులో ఫెయిలైన విద్యార్థులకు ఇటీవల నిర్వహించిన డిగ్రీ ఇన్‌స్టంట్‌ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఎస్‌. నర్సింహాచారి ఆదివారం తెలిపారు. మొత్తం 4,474మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 2,811 మంది (62.83శాతం) ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.ఈ ఫలితాలను సంబంధిత కేయూ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని తెలిపారు.

రీవాల్యుయేషన్‌ ఫలితాలు..

కాకతీయ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ కోర్సుల బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ ఆరో సెమిస్టర్‌ పరీక్షల ఫలితాలు గత నెలలో విడుదల చేశారు. అనంతరం రీవాల్యుయేషన్‌ కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఆయా ఫలితాలను విడుదల చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఎస్‌. నర్సింహాచారి ఆదివారం తెలిపారు. 4,470మంద రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులు చేస్తే 883మంది బెనిఫిట్‌ పొందారు. 19.75శాతం ఉత్తీర్ణత సాధించారు.

'కాళోజీ' పురస్కారం ఎంపికకు కమిటీ ఏర్పాటు

హన్మకొండ కల్చరల్‌ : ప్రజాకవి కాళోజీ నారాయణరావు స్మారకంగా ఏటా అందజేసే 'కాళోజీ నారాయణరావు' పురస్కారాన్ని రాష్ట్ర యూత్‌ అడ్వాన్స్‌మెంట్‌, టూరిజం అండ్‌ కల్చర్‌ డిపార్ట్‌మెంట్‌ వారు 2024 సంవత్సరానికి గాను అర్హులకు ఎంపిక చేయడానికి కమిటీ ఏర్పాటు చేశారు. ఈ మేరకు కమిటీ ఏర్పాటుకు శనివారం ప్రభుత్వ కార్యదర్శి ఏ. వాణిప్రసాద్‌ ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీ చైర్మన్‌గా ప్రజాకవి అందెశ్రీ, కన్వీనర్‌గా రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్‌ మామిడి హరికృష్ణ, సభ్యులుగా కవి, అదనపు కలెక్టర్‌ ఏనుగు నరసింహారెడ్డి, భాషా పండితులు, రిటైర్డ్‌ ప్రిన్సిపాల్‌ సంగంభట్ల నర్సయ్య, వరంగల్‌కు చెందిన కవి, కాళోజీ ఫౌండేషన్‌ ప్రతినిధి పొట్లపల్లి శ్రీనివాస్‌రావు ఉన్నారు.

తాడ్వాయిలో టోర్నడోలు..

● భారీ ఈదురుగాలులకు వేల సంఖ్యలో నేలకూలిన చెట్లు
● పరిశీలించిన మంత్రి సీతక్క


చెట్లు నేలకూలడంతో రోడ్డుకు ఇరువైపులా మైదానంలా కనిపిస్తున్న అడవి

ఎస్‌ఎస్‌తాడ్వాయి: తాడ్వాయి అడవుల్లో శనివారం రాత్రి వీచిన గాలులు అమెరికాలోని టోర్నడో తరహాలో పెను దుమారం రేపాయి. తాడ్వాయి–మేడారం మధ్య అడవిలో వేల సంఖ్యలో చెట్లు నేలకూలాయి. నిమిషాల వ్యవధిలో పచ్చని అడవి మైదానంలా మారింది. రోడ్డుకు ఇరువైపులా సుమారు 2 కిలోమీటర్ల దూరం మేర చెట్లు నేలకూలాయి. ఆదివారం మంత్రి సీతక్క మేడారం–తాడ్వాయి మధ్య నేలకూలిన చెట్లను పరిశీలించారు. వాహనాల రాకపోకలకు గంటల తరబడి అంతరాయం కలిగింది. తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌ రెడ్డి సిబ్బందితో కలిసి చెట్లను తొలగించేందుకు గంటల పాటు శ్రమించారు. పోలీసుల సేవలను వాహనదారులు ప్రశంసించారు.


మహబూబాబాద్‌ అర్బన్‌: మున్నేరు వాగులో మునిగిన వాటర్‌ ట్యాంక్‌


కురవిలో డబుల్‌ ఇళ్ల కాలనీలోకి వచ్చిన వరద నీరు


ఎల్కతుర్తి మండలం ఇందిరానగర్‌లో కూలిన ఇంటిగోడలు


నెల్లికుదురు: మండలంలోని మేచరాజుపల్లిలో నేలమట్టమైన ఇల్లు

వర్ష బీభత్సం..

ఉమ్మడి వరంగల్‌ జిల్లాలో రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం బీభత్సం సృష్టిస్తోంది. ఫలితంగా పలు గ్రామాల్లో ఇళ్లు నీటమునుగుతున్నాయి. శిథిలావస్థలోని ఇళ్లు కూలుతున్నాయి. కాలనీలు జలదిగ్బంధంలో చిక్కుకుంటున్నాయి. రోడ్లు ఎక్కడికక్కడ తెగుతున్నాయి. ఫలితంగా ప్రయాణికులు మార్గమధ్యలో చిక్కుకుని తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాగా, వర్షానికి వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. చెరువు మత్తళ్లు పోస్తున్నాయి. పంట పొలాలు నీటమునుగుతున్నాయి.

-సాక్షి నెట్‌వర్క్‌


కాశిబుగ్గ: గాంధీనగర్‌లో ఇంట్లోకి చేరిన వరద నీటిలో కామిని నరేశ్‌


మత్తడి దూకుతున్న వరంగల్‌లోని భద్రకాళి చెరువు


చెన్నారావుపేట శివారులో నీటిలో మునిగిన పంట పొలాలు


హనుమకొండ బస్టాండ్‌లోకి భారీగా చేరిన వరద నీరు


వర్షపు నీటితో నిండిన మహబూబాబాద్‌ రైల్వే అండర్‌ బ్రిడ్జి


వరంగల్‌ నాగేంద్రనగర్‌లో ఇంట్లోకి వచ్చిన వరద నీరు


ఏటూరునాగారం: కొండాయి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న జంపన్నవాగు


కొత్తగూడ: గండి పడిన రామన్నగూడెం ఊరచెరువు


జనగామ : కుందారం వాగు నుంచి వచ్చే వరదలో చేపలు పడుతున్న స్థానికులు

దెబ్బతిన్న రైల్వేట్రాక్‌..నిలిచిన రైళ్లు

● ప్రయాణికుల ఇబ్బందులు


కేసముద్రం రైల్వేస్టేషన్‌లో నిలిచిన సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్‌ రైళ్లు


కేసముద్రం- ఇంటికన్నె మధ్య వరద ఉధృతికి దెబ్బతిన్న రైల్వేట్రాక్‌

కేసముద్రం: భారీ వర్షం కారణంగా వరద ఉధృతికి మహబూబాబాద్‌ జిల్లా కేసముద్రం – ఇంటికన్నె రైల్వేస్టేషన్ల మధ్య, మహబూబాబాద్‌– తాళ్లపూసపల్లి రైల్వేస్టేషన్ల మధ్య వరద ఉధృతితో రెండుచోట్ల రైల్వేట్రాక్‌ దెబ్బతిన్న ఘటనతో రైళ్లు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. శనివారం సాయంత్రం నుంచి మొదలైన భారీవర్షం, అదేరీతిలో కురవడంతో కేసముద్రంవిలేజ్‌ పెద్దచెరువు, దామెరచెరువు, ఇంటికన్నె చెరువులు మత్తళ్లు పోశాయి. దీంతో ఆ మత్తళ్లు పోసిన వరదనీరుతో ఇంటికన్నె– కేసముద్రం రైల్వేస్టేషన్ల మధ్య ట్రాక్‌ తెగిపోయింది. అప్పటికే అప్‌లెన్‌లో బెంగళూర్‌ –దానాపూర్‌ సంఘమిత్ర, డౌన్‌లైన్‌లో దానాపూర్‌ –బెంగళూర్‌ సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్‌ రైళ్లను కేసముద్రం రైల్వేస్టేషన్‌లో ఆదివారం తెల్లవారుజామున 2గంటల ప్రాంతంలో నిలిపారు. కాగా, అర్ధరాత్రి నుంచి తెల్లవారుజామున వరకు ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఆదివారం ఉదయం రైల్వేస్టేషన్‌కు చుట్టూరా వరద ఉధృతి ఉండడంతో ఎవరూ హోటళ్లు తెరవలేదు. దీంతో పిల్లలతో ప్రయాణీకులు ఆకలితో ఇబ్బందులు పడ్డారు. దీంతో మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌ నాయకులు, దాతలు, పలుసంఘాల నాయకులు స్పందించారు. వాటర్‌ బాటిళ్లు, బిస్కెట్లు, పాలు, భోజనం అందజేశారు. సుమారు 4 వేల మంది ప్రయాణీకులు ఒక్కసారిగా రైల్వేస్టేషన్‌లో దిగడంతో ప్రాంగణమంతా కిక్కిరిసింది. కాగా, సాయంత్రం వరకు రైళ్లు ఎటూ కదలకపోవడంతో ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు పంపించాలంటూ అధికారులతో మొరపెట్టుకున్నారు. అధికారులు కలిసి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ, ప్రైవేట్‌ బస్సుల్లో రూరల్‌ సీఐ సర్వయ్య, ఎస్సై మురళీధర్‌రాజు ఆధ్వర్యంలో ప్రయాణికులను క్షేమంగా వరంగల్‌ తరలించారు.

డోర్నకల్‌ టు రాజమండ్రి రూ. 12 వేలు

భారీ వర్షాలతో రైల్వే ట్రాక్‌ దెబ్బతిని ఆదివారం పలు రైళ్లు డోర్నకల్‌లో నిలిచిపోయాయి. రైళ్ల రాకపోకలు పూర్తిగా నిలిచిపోవడంతో అత్యవసర పనులపై వెళ్తున్న వారు ప్రైవేట్‌ వాహనాలను ఆశ్రయించారు. ఖమ్మం, మహబూబాబాద్‌, హైదరాబాద్‌, విజయవాడ, రాజమండ్రి తదితర ప్రాంతాలకు వెళ్తున్న వారు తమ సమీప బంధువులు, మిత్రులకు సమాచారం అందించి వాహనాలను సమకూర్చుకుని వెళ్లారు. వరంగల్‌ నుంచి రాజమండ్రి వెళ్తున్న ఓ బృందం ఖమ్మం నుంచి వాహనాలను డోర్నకల్‌కు రప్పించి ఒక్కో వాహనానికి రూ.12 వేల చొప్పున చెల్లించి వెళ్లారు. ఖమ్మం, మహబూబాబాద్‌ తదితర ప్రాంతాల్లో ప్రైవేట్‌ వాహనాలను అద్దెకు తీసుకుని వెళ్లారు.

థాంక్యూ డోర్నకల్‌...

● సుమారు మూడు వేల మంది ప్రయాణికులకు తాగునీరు, అల్పాహారం, భోజనం అందించిన పట్టణ వాసులు.
● హర్షించిన రైలు ప్రయాణికులు

డోర్నకల్‌ వాసులు మానవత్వం చాటారు. భారీ వర్షాలతో రైల్వే ట్రాక్‌ దెబ్బతిని డోర్నకల్‌లో గంటల పాటు రైళ్లు నిలిచాయి. ఫలితంగా దూరప్రాంత ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో మేమున్నామంటూ డోర్నకల్‌ వాసులు ముందుకొచ్చారు. రాజకీయ నాయకులు, వ్యాపారులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, ముస్లిం సంస్థల ప్రతినిధులు రైల్వే స్టేషన్‌కు చేరుకుని ప్రయాణికులకు చేయూతనందించారు. ఉదయం 1.3 క్వింటాళ్లతో ఉప్మా, టమాటా బాత్‌ తయారు చేసి పంపిణీ చేశారు. మధ్యాహ్నం నుంచి 2.5 క్వింటాళ్ల బియ్యంతో పాటు కూరగాయలతో భోజనం సిద్ధం చేసి రైల్వే సిబ్బంది సహకారంతో ప్రయాణికులకు భోజనం పంపిణీ చేశారు. స్థానిక వాటర్‌ప్లాంట్‌ యజమానులు ప్రయాణికులకు వాటర్‌ పంపిణీ చేశారు. రైల్వే ట్రాక్‌ దెబ్బతిని ఆరు రైళ్లు డోర్నకల్‌లో గంటల తరబడి నిలవగా స్థానికులు నీళ్లు, అల్పాహారం, భోజనం అందించడంపై ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.


డోర్నకల్‌ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు భోజనం పంపిణీ చేస్తున్న స్థానికులు



మహబూబాబాద్‌ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు భోజనం అందజేస్తున్న పోలీసులు, వర్తక, వాణిజ్య సంస్థల ప్రతినిధులు

మహబూబాబాద్‌లో..

మహబూబాబాద్‌ రూరల్‌ : వర్షం కారణంగా మహబూబాబాద్‌ రైల్వేస్టేషన్‌ రెండో నంబరు ప్లాట్‌ఫారం వైపున మచిలీపట్నం, సింహపురి రైళ్లు నిలిచిపోయాయి. రెండు రైళ్లలో కలిపి సుమారు రెండు వేల మంది వరకు ప్రయాణికులు ఉండగా వారు ఇబ్బందులు పడుతుండగా సమాచారం తెలుసుకున్న టౌన్‌ పోలీసులు, జీవీఎల్‌, శ్రీవాసవి సేవా ట్రస్ట్‌, శ్రీవాసవి దేవాలయ కమిటీ, సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో అల్పాహారం, స్నాక్స్‌, మంచినీళ్లు అందజేసి ఆదుకున్నారు. ప్రయాణికులకు అవసరమైన బీపీ, షుగర్‌, జ్వరం పరీక్షలు జరిపి ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి మందులు అందజేశారు.

మృత్యు ప్రవాహం..

ఉమ్మడి వరంగల్‌ జిల్లాలో రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం పలు కుటుంబాల్లో విషాదం నింపుతోంది. ఆస్తితోపాటు ప్రాణనష్టం కలిగిస్తోంది. భీకర వరద ప్రవాహంలో ముగ్గురు కొట్టుకుపోయి మృతి చెందారు. ఒకరు గల్లంతయ్యారు. ఓ వృద్ధురాలు పిడుగుపాటు శబ్దానికి భయాందోళనకు గురై గుండెపోటుతో మృతి చెందింది. దీంతో ఆయా కుటుంబాలు శోకసంద్రంలో మునిగాయి.


వరదనీటిలో నుంచి మృతదేహాన్ని బయటకు తీసుకొస్తున్న ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు

దుగ్గొండి: వరద నీటి ప్రవాహంలో పడి ఓ వృద్ధురాలు మృతి చెందింది. ఈ ఘటన ఆదివారం మండలంలోని గిర్నిబావి సమీపంలో జరిగింది. మందపల్లి గ్రామానికి చెందిన కొండ్ర సమ్మక్క(75) రోజూ గిర్నిబావికి వచ్చి భిక్షాటన చేసి ఇంటికి వెళ్లేది. ఈ క్రమంలో శనివారం సాయంత్రం వరకు గిర్నిబావిలో కనిపించిన సమ్మక్క.. చీకట్లో జోరు వానలో దారి తెలియక మందపల్లి రోడ్డుకు వెళ్లాల్సి ఉండగా దుగ్గొండి రోడ్డుకు వెళ్లింది. లోకేశ్వర ఇండస్ట్రీస్‌ సమీపంలో రోడ్డు పక్కన కాలుజారి వరదనీటిలో పడింది. ఆదివారం ఉదయం వరద ఉధృతి తగ్గడంతో మృతదేహం కనిపించింది. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయగా కొండ్ర సమ్మక్కగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతురాలికి కుమారుడు సదయ్య, కుమార్తె సాంబలక్ష్మి ఉన్నారు. ఘటనా స్థలిని ఎమ్మెల్యే మాధవరెడ్డి సందర్శించారు. బాధిత కుటుంబానికి రూ. 10 వేల ఆర్థికసాయం అందించారు.

ఎస్సై వెంకటేశ్వర్లు మానవత్వం..

వరద నీటిలో తేలిన కొండ్ర సమ్మక్క మృతదేహాన్ని బయటకు తీసుకురావడానికి అటుగా వెళ్తున్న వారిని అడిగితే సహకరించకపోవడంతో ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు స్వయంగా బురదలోకి దిగారు. హోంగార్డుతో కలిసి మృతదేహాన్ని బయటకు తీసుకొచ్చి శుభ్రం చేశారు.

పిడుగుపాటు శబ్దానికి వృద్ధురాలి మృతి

గూడూరు: పిడుగుపాటు శబ్దానికి భయభ్రాంతులకు గురైన ఓ వృద్ధురాలు.. గుండెపోటుతో మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని బొల్లెపల్లి శివారు ఎస్సీ కాలనీలో జరిగింది. కాలనీకి చెందిన కోరె తిరుపతమ్మ (55) ఇంటి వద్ద ఒక్కరే ఉంటుంది. ఈ క్రమంలో శనివారం రాత్రి కురిసిన వర్షానికి శబ్దంతో కూడిన పిడుగు తిరుపతమ్మ ఇంటి సమీపంలో పడింది. ఈ శబ్దానికి ఇంట్లో నిద్రిస్తున్న తిరుపతమ్మ భయభ్రాంతులకు గురై గుండెనొప్పి అంటూ మృతి చెందింది. ఈ ఘటనపై మృతురాలి కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపారు.

పశువుల కోసం వెళ్లి కాల్వపల్లిలో యువకుడు..



మల్లికార్జున్‌ (ఫైల్‌)

ఎస్‌ఎస్‌తాడ్వాయి: పశువుల కోసం వెళ్లిన ఓ యువకుడు ఒర్రె(వాగు)లో పడి మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం మండలంలోని కాల్వపల్లిలో చోటు చేసుకుంది. తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన జెరుపోతుల మల్లికార్జున్‌(38) పశువుల కోసం వెళ్లాడు. వస్తున్న క్రమంలో గ్రామంలోని పాఠశాల వెనుక ఉన్న ఒర్రె లోనుంచి నుంచి దాటుతున్న క్రమంలో వరదలో పడి మృతి చెందాడు. మృతుడికి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

రాజీపేటలో చెరువులో పడి వ్యక్తి..

పరకాల: చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి..చెరువులో జారి పడి మృతిచెందాడు. ఈ ఘటన పరకాల మున్సిపాలిటీ విలీన గ్రామం రాజీపేటలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గువ్వ రాములు(58) గత నెల 30న మరో ఇద్దరితో కలిసి చేపల వేట కోసం వెళ్లాడు. చెరువు వద్దకు వెళ్లిన ఇద్దరు ఇంటికి రాగా రాములు మాత్రం రాలేదు. దీంతో ఆందోళన చెందుతూ అదే రాత్రి నుంచి గాలించిన ఫలితం కనిపించలేదు. చివరకు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అనుమానిత ప్రాంతాలలో డ్రోన్‌ ద్వారా గాలింపు చేయగా అలియాబాద్‌ సమీపంలోని ఓ కుంట వద్ద రాములు మృతదేహం లభ్యమైంది. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వెంకటాపురంలో చేపల వేటకు వెళ్లి వ్యక్తి గల్లంతు..


నర్సయ్య (ఫైల్‌)

తొర్రూరు రూరల్‌: రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో ఉధృతంగా ప్రవహిస్తున్న మండలంలోని వెంకటాపురం శివారులో ఉన్న వాగులో పడి ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. గ్రామానికి చెందిన గుండాల వెంకన్న, నర్సయ్య అన్నదమ్ముళ్లు. ఇద్దరూ కలిసి చేపల వేట కోసం శనివారం సాయంత్రం వాగు వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో నర్సయ్య(47) కాలుజారి వాగులో పడడంతో వరద ఉధృతికి కొట్టుకుపోయాడు. తన తమ్ముడు నర్సయ్య వాగులో కొట్టుకుపోతుండగా కాపాడలేని స్థితిలో లబోదిబోమంటూ వెంకన్న పరిగెత్తుకుంటూ వెళ్లి కుటుంబీకులు, గ్రామస్తులకు సమాచారం ఇచ్చాడు. దీంతో వారు వాగు వద్దకు వెళ్లి చూడగా నర్సయ్య అప్పటికే కొట్టుకుపోయాడు. ఆదివారం ఉదయం ఈ సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, పోలీసులు, అధికారులు ఘటనా స్థలిని పరిశీలించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. గాలింపు చర్యలు చేపట్టగా ఇంకా నర్సయ్య ఆచూకీ లభించలేదు.

రైల్వే రవాణా అతలాకుతలం..


కాజీపేట జంక్షన్‌లో రైళ్ల కోసం ప్రయాణికుల పడిగాపులు


కాజీపేట జంక్షన్‌లో కలెక్టర్‌ ప్రావీణ్య

● వర్షాలతో పలు రైళ్లు రద్దు, దారి మళ్లింపు
● కాజీపేట, వరంగల్‌ మీదుగా ప్రయాణించే 28 రైళ్లు రద్దు
● 21 ట్రెన్లు దారి మళ్లింపు

కాజీపేట రూరల్‌: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో వరంగల్‌-విజయవాడ మార్గంలో ఇంటికన్నె, తాళ్లపూసపల్లి సమీపంలో రైల్వే ట్రాక్‌ ధ్వంసమైంది. దీంతో ఆదివారం రైల్వే రవాణా వ్యవస్థ అతలాకుతలమైంది. ఫలితంగా దక్షిణ మధ్య రైల్వే అధికారులు కాజీపేట, వరంగల్‌ స్టేషన్ల మీదుగా న్యూఢిల్లీ-విజయవాడ-హైదరాబాద్‌ రూట్‌లో వెళ్లే పలు రైళ్లు రద్దు చేయడంతోపాటు పలు రైళ్లను దారి మళ్లింపు, మరి కొన్ని రైళ్లు గంటల తరబడి ఆలస్యంగా నడిపిస్తున్నారు.

రద్దయిన రైళ్లు ఇవే

విజయవాడ-సికింద్రాబాద్‌ (12713) ఎక్స్‌ప్రెస్‌, సికింద్రాబాద్‌-విజయవాడ (12714) ఎక్స్‌ప్రెస్‌, గుంటూరు-సికింద్రాబాద్‌ (17021) ఎక్స్‌ప్రెస్‌, సికింద్రాబాద్‌-సిర్‌పూర్‌కాగజ్‌నగర్‌ (17233) ఎక్స్‌ప్రెస్‌, సికింద్రాబాద్‌-గుంటూరు (12706) ఎక్స్‌ప్రెస్‌, గుంటూరు-సికింద్రాబాద్‌ (12705) ఎక్స్‌ప్రెస్‌, సికింద్రాబాద్‌-గుంటూరు (17202) ఎక్స్‌ప్రెస్‌, విశాఖపట్నం-సికింద్రాబాద్‌ (20708) ఎక్స్‌ప్రెస్‌, కాకినాడ పోర్టు-లింగంపల్లి (12737) ఎక్స్‌ప్రెస్‌, గూడూరు-సికింద్రాబాద్‌ (12709) ఎక్స్‌ప్రెస్‌, భద్రాచలం-బల్లార్షా (17033) ఎక్స్‌ప్రెస్‌, బల్లార్షా -కాజీపేట (17004) ప్యాసింజర్‌, భద్రాచలం-సికింద్రాబాద్‌ (17660) ఎక్స్‌ప్రెస్‌, సికింద్రాబాద్‌-భద్రాచలం (17659) ఎక్స్‌ప్రెస్‌, కాజీపేట-డోర్నకల్‌ (07753) ప్యాసింజర్‌, సికింద్రాబాద్‌-హౌరా (12704) ఎక్స్‌ప్రెస్‌, కరీంనగర్‌-తిరుపతి (12762) ఎక్స్‌ప్రెస్‌, హైదరాబాద్‌-విశాఖపట్నం (12728) ఎక్స్‌ప్రెస్‌, విశాఖపట్నం-హైదరాబాద్‌ (12727) ఎక్స్‌ప్రెస్‌, విశాఖపట్నం-సికింద్రాబాద్‌ (12739) ఎక్స్‌ప్రెస్‌, సికింద్రాబాద్‌-మణుగూరు (12745) ఎక్స్‌ప్రెస్‌, మణుగూరు-సికింద్రాబాద్‌ (12746) ఎక్స్‌ప్రెస్‌, తాంబరం-హైదరాబాద్‌ (12759) ఎక్స్‌ప్రెస్‌, హైదరాబాద్‌-తాంబరం (12760) ఎక్స్‌ప్రెస్‌, విశాఖపట్నం-ఎల్‌టీటీ ముంబయి (18519) ఎక్స్‌ప్రెస్‌, విశాఖపట్నం-మహబూబ్‌నగర్‌ (12861) ఎక్స్‌ప్రెస్‌, చెన్నై సెంట్రల్‌-జైపూర్‌ (12967) ఎక్స్‌ప్రెస్‌, చెన్నై సెంట్రల్‌-న్యూఢిల్లీ (12615) ఎక్స్‌ప్రెస్‌, తిరుపతి-సికింద్రాబాద్‌ (0 7481) ఎక్స్‌ప్రెస్‌, చెన్నైసెంట్రల్‌-న్యూఢిల్లీ (1262 1) ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేసినట్లు అధికారులు తెలిపా రు.

దారి మళ్లింపు..

విజయవాడ, డిల్లీ, మార్గంలో ప్రయాణించే 21 రైళ్లను వయా కాజీపేట, వయా నడికుడ మీదుగా దారి మళ్లించి నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

ప్రమాదకరంగా నష్కల్‌ వద్ద రైల్వే ట్రాక్‌..

కాజీపేట-ఘన్‌పూర్‌ మధ్యలోని నష్కల్‌ రైల్వే వంతెన వద్ద ట్రాక్‌కు ప్రమాదం పొంచి ఉంది. రైల్వే అధికారులు ట్రాక్‌మెన్లు, పెట్రోల్‌మెన్లను అప్రమత్తం చేసి గస్తీ ముమ్మరం చేశారు.

4వేల మంది ప్రయాణికుల తరలింపు

కేసముద్రం మండలంలో రైల్వేట్రాక్‌ తెగడంతో కాజీపేట జంక్షన్‌లో రైళ్లను నిలిపివేశారు. ఆదివారం రాత్రి హనుమకొండ కలెక్టర్‌ ప్రావీణ్య, అదనపు కలెక్టర్‌ వెంకట్‌రెడ్డి, ఆర్డీఓ వెంకటేష్‌లు వచ్చారు. జంక్షన్‌లో ఉన్న సుమారు నాలుగు వేల మంది ప్రయాణికులను స్వస్థలాలకు పంపించే ఏర్పాట్లు చేశారు. కొందరిని కాజీపేట నుంచి ధానాపూర్‌, బెంగళూర్‌కు ప్రత్యేక రైల్‌లో పంపించారు. రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణ మంత్రి పొన్నం ప్రభాకర్‌, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌ రెడ్డిలు రైల్వే స్టేషన్‌కు చేరుకొని ప్రయాణికులతో మాట్లాడి అన్ని విధాల ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.